సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 25 । మే । 2023



టైర్ల దొంగ అరెస్ట్
టైర్ల దుకాణంలో పనిచేసిన ఓవ్యక్తి పని మానేశాక రూ.6.50లక్షల విలువచేసే ఎం.ఆర్.ఎఫ్ టైర్లను దొంగిలించి పోలీసులకు పట్టుబడినట్లు డీఎస్పీ కేశవ్ప చెప్పారు. -8లో..



వినియోగదారులు సంతృప్తి చెందేలా విద్యుత్ సేవలు
వినియోగదారులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరు ఎస్ రమణ అన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1021మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	405	420
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 194.10 కిలోలు

న్యూస్‌రీల్

గ్రామాభివృద్ధికి ఎస్‌డబ్ల్యూపీసీ నిధులు వినియోగించాలి
రామాపురం: గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాల్లో (ఎస్‌డబ్ల్యూపీసీ) కంపోస్టు ఎరువులను తయారు చేయాలని, తద్వారా వచ్చే నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం చిట్లూరు పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఉషారాణి, సర్పంచ్ రామానుజులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, అరుణమ్మ, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి రెడ్డి, సచివాలయం సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా సుదర్శన్‌రెడ్డి



బాధ్యతలు చేపట్టిన జల్లా సుదర్శన్ రెడ్డి

కడప అర్బన్/ గాలివీడు: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా జల్లా సుదర్శన్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కాగా ఈయన స్వగ్రామం ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని గాలివీడు మండలం. గత 25 సంవత్సరాల నుంచి కడపలోని జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. మంచి గుర్తింపు వుంది. రాష్ట్ర హైకోర్టు ఆమోదంతో ఈయనను డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని అన్ని కోర్టులలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్స్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్స్..వారి సిబ్బంది ఈయన పరిధిలోకి వస్తారు.

దీవెనతో భవిత దేదీప్యం

- కలెక్టర్ గిరీషా పీఎస్
- జగనన్న విద్యాదీవెన కింద 28,936 మంది తల్లుల ఖాతాలలో రూ.26.94 కోట్లు జమ



విద్యార్థులకు సంబంధించిన రూ.26.94 కోట్ల మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు వేదిక నుంచి జగనన్న విద్యాదీవెన పథకం సంబంధించి 2023 జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించి అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ పథకానికి సంబంధించి ఆర్థిక లబ్ధిని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదుజమ చేసే కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సంక్షేమ,సాధికారత అధికారి జాకీర్‌హుస్సేన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సందప్ప, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్సులం, వివిధ సంక్షేమ అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదన్నారు. చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పుల పాలు కాకూడదన్న సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెనను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంతో విద్యార్థుల భవిత దేదీప్యమానంగా ఉంటుందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థులు, కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. కాలేజీల్లో జవాబుదారీతనం పెరిగేలా, విద్యార్థుల తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పిస్తూ, తల్లుల సాధికారతకు పట్టం కడుతూ నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద 2023 జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించి అర్హులైన 28,936 మంది తల్లుల ఖాతాలలో రూ.26.94 కోట్ల మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు జిల్లాకలెక్టర్ అందజేశారు.

బాగా చదువుకుంటా



మా చదువుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక సహకారం అందించడం చాలా సంతోషంగా ఉంది. బాగా చదువుకని మంచి ఉద్యోగం సంపాదిస్తా. తల్లిదండ్రులను బాగా చూసుకుంటాను. జగన్ సార్ పథకాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారు. హాట్సాఫ్ టు సీఎం సారు..

– ఎం.శివమణి, విద్యార్థిని, రాయచోటి మహిళా డిగ్రీ కాలేజీ

పేదల ఇంట విద్యాజ్యోతి వెలిగిస్తున్నారు



ఫీజు రీయింబర్స్‌మెంట్ మా తల్లి ఖాతాలో జమ అయ్యాయి. నిరుపేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి సకాలంలో బకాయిలు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. ఏ విడతకు ఆ విడతగా తల్లుల ఖాతాలకు చెల్లించి వారే కాలేజీలకు ఫీజులు కట్టేలా చేసి పేదల ఇంట విద్యా జ్యోతులు వెలిగిస్తున్నారు. మా చదువులపై తల్లిదండ్రుల కంటే ఎక్కువగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తున్నారు.

– కె.కవిత, డైట్ కళాశాల విద్యార్థిని,రాయచోటి

థ్యాంక్యూ జగన్ మామయ్య



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సారు విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌లు ఇచ్చి పేద, మధ్యతరగతి కుటుంబాలలో వెలుగులు నింపారు. అలాగే తండ్రి ఆశయాలతో ఆయన తనయుడిగా విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టారు. వీటివల్ల నా లాంటి విద్యార్థులు ఎందరో చదువుకుంటున్నారు. నిజంగా మీరు మాకు దేవుడిచ్చిన అన్నయ్యగా భావిస్తున్నాం. చదువుకోవాలన్న పట్టుదల ఉండి డబ్బుల్లేక వాళ్ల ఆశలు వారే నాశనం చేసుకుంటున్న టైంలో మీరు ఇలాంటి పథకాలు పెట్టి మాలాంటి పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపుతున్నారు. థ్యాంకూ జగన్ మామయ్య..

– సి.స్నేహ, విద్యార్థిని, షిర్డీ సాయి డిగ్రీ కాలేజీ, రాయచోటి

భూ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు



పులపత్తూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

రాజంపేట: అన్నమయ్య డ్యాం వరద పీడితుల భూ సమస్యల పరిష్కారందిశగా రెవెన్యూ అధికారులు అడుగులు వేశారు. బుధవారం పులపత్తూరు గ్రామంలో ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పులపత్తూరు గ్రామాన్ని సందర్శించిన క్రమంలో రెవెన్యూపరంగా నెలకొన్న సమస్యలను బాధితులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా వరదల వల్ల ఇంటిలోని భూమి ఆధారిత పుస్తకాలు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భూ సంబంధిత సమస్యలు తలెత్తాయి. ఇప్పటికే ఇలాంటి వాటిని పరిష్కరించారు. మిగిలిపోయిన వాటిని కూడా పరిష్కరించాలని ఆదేశించారు. సదస్సులో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ రెవెన్యూపరంగా బాధితులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసర్పంచి భీము శ్రీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి భీము జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తలెత్తిన సమస్యలను ఒకొక్కటిగానే పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదకన అభివృద్ధికి సంబంధించి అన్ని కార్యక్రమాలను చేపతుతోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో భాస్కర్, తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డి, హౌసింగ్ డీఈ మురళీ, పులపత్తూరు గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- పులపత్తూరు గ్రామస్తులకు ఆర్వో నీటి సరఫరాను వైఎస్సార్‌సీపీ నాయకులు భీము జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుచేశారన్నారు.

బిందు సేద్యం.. సర్కారు సాయం

- అన్నదాతలకు అండగా ప్రభుత్వం
- ముమ్మరంగా పరికరాల పంపిణీ
- 2022–23కు 9942 మందికి అందజేత
- 2023–24లో 12 వేల హెక్టార్ల సాగు లక్ష్యం
- ఈ ఏడాది పంపిణీలో జిల్లాకు రాష్ట్రంలో రెండోస్థానం



దేవపట్ల సమీపంలో డ్రిప్ సాయంతో సాగులో ఉన్న మామిడి

సాక్షి రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటూ వస్తోంది. రైతు భరోసా, వైఎస్సార్ పంటల బీమా, సున్నావడ్డీ ఇలా చెబుతూ పోతే రైతు భరోసా కేంద్రాల వరకు అన్నదాతలకు సర్కార్ అండగా ఉంటూ వస్తోంది. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, యంత్రపరికరాలను ఇటీవల సబ్సిడీపై అందించింది. అలాగే పంట పొలాల్లో ప్రతి నీటి చుక్క వృథా చేయకుండా సద్వినియోగం చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి విపత్తును ఎదుర్కొనకుండా ముందుకు వెళ్లేందుకు అనువుగా అవసరమైన రైతులకు మైక్రో ఇరిగేషన్ ద్వారా బిందు, తుంపర పరికరాలను అందిస్తూ రాష్ట్రంలో ముందు వరుసలో నిలబెడుతోంది. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర సేద్య పరికరాలను అందించి సాగుకు అండగా నిలుస్తోంది.

రాష్ట్రంలో రెండోవస్థానం

అన్నమయ్య జిల్లాలో సూక్ష్మసేద్య పరికరాలను ప్రభుత్వం రాయితీతో అందిస్తోంది. వీటిని వేగంగా రైతులకు అందించడంలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా రెండోస్థానంలో ఉంది. దేశంలో 10వ స్థానంలో జిల్లా నిలిచింది. అధికారులు వేగంగా కదులుతూ కంపెనీల ద్వారా పరికరాలు అందేలా చర్యలు చేపడుతున్నారు.

9942 మంది రైతులకు అందజేత:

అన్నమయ్య జిల్లాలో 2022–23కు సంబంధించి దరఖాస్తు చేసుకున్న 9942 మంది రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందించారు. జిల్లాలో దాదాపుగా 10,754 హెక్టార్లకు అందించడం జరిగింది. ఇదే స్ఫూర్తితో 2023–24కు సంబంధించి 12000 హెక్టార్లలో సూక్ష్మసాగునీటి విధానాన్ని అమలు చేయాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైతులకు వేగంగా పరికరాలు



జిల్లాలో సూక్ష్మ సేద్యం సాగుకు సంబంధించి దరఖాస్తు చేసుకుంటున్న రైతులకు వేగంగా పరికరాలు అందజేస్తున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది వెళ్లి రైతుల పొలాల్లో సర్వే చేసి కంపెనీల ద్వారా పరికరాలు అందజేస్తున్నాం. లక్ష్యాల సాధనలో రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో ఉండగా, దేశంలో పదోస్థానంలో నిలిచింది.

– వెంకటేశ్వరరెడ్డి, జిల్లా సూక్ష్మ నీటి సేద్య అధికారి, రాయచోటి

సకాలంలో డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేయాలి
కడప అగ్రికల్చర్: రైతులకు సకాలంలో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేయాలని, వారి అభివృద్ధికి ఇంజినీర్లు కృషి చేయాలని గుంటూరు ఏపీఎంఐపీ ఓఎస్డీ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ప్రాజెక్టు కార్యాలయంలో పీడీ రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన ఏపీఎంఐపీ, ఎంఐ కంపెనీ ఇంజినీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలు అమర్చే విషయంలో ఎంఐ కంపెనీ ఇంజినీర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీరు క్షేత్ర సిబ్బందితో కలిసి పని చేస్తే తప్పులు జరగడానికి అవకాశం ఉండదని అన్నారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి 9 వేల హెక్టార్లు లక్ష్యంగా ఇవ్వగా అందులో 9982 హెక్టార్లలో పూర్తి చేసి ఇప్పటి వరకు 9076 హెక్టార్లకు పరికరాలను రైతులకు అందించామన్నారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10,500 హెక్టార్లు టార్గెట్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మురళీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై కుండపోత

- గాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- అంధకారంలో బి.కొత్తకోట



నిమ్మనపల్లె: రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్లు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మంగళ, బుధవారాలు కుండపోత వర్షం కురిసింది. కొండపైన వాగులు, వంకలు, చెక్‌డ్యామ్‌లు నిండి గంగోత్రి చెరువులోకి నీళ్లు ప్రవహిస్తున్నాయి. బి.కొత్తకోటలోని పెద్దచెరువులో మూడు విద్యుత్‌స్తంభాలు నీటిలో కూలిపోవడంతో సగం పట్టణానికి మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కొంతసేపు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ సర ఫరా నిలిచిపోయింది. పెద్దచెరువులో మూడు, సూరప్పగారిపల్లెలో రెండు, బడికాయలపల్లెలో రెండు, అయ్యావారిపల్లెలో రెండు, వేమిలేటికోటలో మూడు స్తంభాలు కూలిపోయాయి. పెద్దచెరువులో కూలిన స్తంబాలను తిరిగి పునరుద్ధరించేందుకు డిస్కం సిబ్బంది నీటిలో అవస్థలు పడ్డారు. బుధవారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి.

విరిగిపడి చెట్లు:రాకపోకలకు అంతరాయం

నిమ్మనపల్లె: ఈదురుగాలులు, వడగళ్ల వర్షానికి మండలంలోని పలుగ్రామాల్లో మామిడిపంట దెబ్బతింది. కాయలు నేలరాలాయి. చెట్లు విరిగిపడ్డాయి. బుధవారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. గాలులకు అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లె రోడ్డు మార్గంలో చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. రెడ్డివారిపల్లెకు చెందిన భగీరెడ్డి మామిడితోటలో మామిడికాయలు నేలరాలాయి. కోళ్లఫారం పైకప్పు దెబ్బతింది. అగ్రహారం నుంచి రెడ్డివారిపల్లె, బండమీదపల్లెకు వెళ్లే రోడ్డు మార్గంపై చెట్లు విరిగిపడటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

గాలివానకు దెబ్బతిన్న పంటలు



నేలవాలిన బొప్పాయి చెట్టును పరిశీలిస్తున్న రైతు

సంబేపల్లె: మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, వడగండ్ల వాన కురిసింది. దేవకుంట్ల, పుట్లపల్లె, ఎస్.సోమవరం గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి, మామిడి, మునగ పంటలు దెబ్బతిన్నాయి. ఈ మూడు గ్రామాల్లో దాదాపు ముప్పై ఎకరాల్లో బొప్పాయి చేతికి వచ్చే సమయంలో తుడిచిపెట్టుకుపోయింది. పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టిన రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మామిడి కాయలు నేలరాలిపోయాయి.మునగ, ఇతర కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను బుధవారం ఉద్యానవనశాఖ అధికారిణి వనిత పరిశీలించారు. నష్టం వివరాల నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



కడపలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు నిర్ణీత సమాయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 62 పరీక్షా కేంద్రాల్లో ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ ఏడాది విద్యార్థులకు పరీక్షలు జరి గాయి. ఇందులో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ ఓకేష న్‌కు సంబంధించి 6180 మందికి గాను 5713 మంది పరీక్షలు రాశారు. దీంతో 91.4 శాతం హాజరు నమోదైంది. ఇంటర్ ఆర్‌ఐవో రమణరాజు కడపలోని జేఎంజే జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. నలుగురు జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్, 10 మంది సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

వృద్ధుడు అదృశ్యం


ఖాదర్‌ఖాన్ (ఫైల్)

కలకడ : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని, కోన పంచాయతీ బంగారువాండ్లపల్లె గ్రామానికి చెందిన పఠాన్ ఖాదర్‌ఖాన్(80)కు మతిస్థిమితం లేదు. దీంతో అనేక మార్లు ఇంటినుంచి ఎవ్వరికీ ఎలాంటి సమాచారం లేకుండా వెళ్లిపోయేవాడు. పలుమార్లు చుట్టు పక్కల గ్రామస్తులు ఇచ్చిన సమాచారం తో ఇంటికి తీసుకొచ్చేవారు. అయితే ఈనెల 10వ తేదీ ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ తెలియకపోవడంతో ఖాదర్‌ఖాన్ అల్లుడు నూర్‌బాష బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోంగార్డుకు సాయం

కురబలకోట : ముదివేడు పోలీస్ స్టేషన్ హోమ్ గార్డు ఆర్. మధుకర్ రెడ్డి (మధు హెచ్‌జి 274)పట్ల అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మానవత్వం చాటుకున్నారు. ఇటీవల హోంగార్డు విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ అతనికి బుధవారం రూ.30 వేల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. కష్టకాలంలో అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు. ఏఆర్ డీఎస్పీ పి. మహబూబ్ బాషా, ఆర్ఐ ఎస్.జావిద్, మదనపల్లె హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఎం. రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక గొడవతో వ్యక్తి దారుణ హత్య


హత్యకు గురైన నరసింహులు

కేవీపల్లె : ఆర్థిక గొడవతో వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలుకు చెందిన నరసింహులు (45) గత మూడేళ్లుగా మండలంలోని జిల్లేళ్లమందలో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో దేవాండ్లపల్లెకు చెందిన రాజన్న ఇంటి పని చేయడానికి రూ. 3.70 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. పనిని బట్టి దశల వారీగా డబ్బులు తీసుకుంటూ వచ్చాడు. ఇంటి నిర్మాణం ప్రస్తుతం ప్లాస్టింగ్ దశ జరుగుతోంది. మంగళవారం రాత్రి తనకు డబ్బులు ఇవ్వాలని మేస్త్రీ నరసింహులు కోరాడు. అయితే పనిచేశాక ఇస్తానని రాజన్న చెప్పడంతో ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో రాజన్న కర్రతో కొట్టడంతో నరసింహులు మృతి చెందాడు. ఎస్ఐ లోకేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్లాట్ల పేరుతో ఘరానా మోసం

- అగ్రిమెంట్లతో పేద అమాయకులకు కుచ్చుటోపి
- లక్షల విలువైన ప్లాట్లు చవక అంటూ మోసం
- రూ.15 కోట్ల భూముల ఆక్రమణకు యత్నాలు
- మోసానికి పాపం పడింది..కేసు నమోదు



ప్లాట్ కేటాయిస్తూ పెద్ద ఓబులేశు రాసిచ్చిన అగ్రిమెంటు

బి.కొత్తకోట : బి.కొత్తకోట బీరంగిరోడ్డులో ఇంటి స్థలాల విలువ లక్షల్లో పలుకుతున్నాయి. ఈ విషయం స్థానికంగా అందరికీ తెలుసు..అయితే తన దికాని భూమిలో ఇంటిస్థలాలు ఇస్తానని ఓ వ్యక్తి కేవలం రూ.3 వేలకే ప్లాటు అంటూ నమ్మించి పేదలను మోసం చేశాడు. నోటిమాటతో కాకుండా ఏకంగా తనదికాని భూమి తన స్వంత భూమి అంటూ పేదలకు అగ్రిమెంట్లు కూడా రాసిచ్చాడు. ఈ వ్యవహారంపై భూ యజమానులు ఆందోళనకు గురై రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఆశ్రయించడంతో మోసం బట్టబయలైంది. పోలీసు విచారణలో మోసం నిర్ధారణ కావడంతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ కే.రామమోహన్ తెలిపారు. బి.కొత్తకోటలో సంచలనం కలిగించిన ఈ రియల్ మోసం వివరాలు ఆయన కథనం మేరకు..

బి.కొత్తకోటకు చెందిన దేరంగుల పెద్ద ఓబులేశు (65) బీరంగిరోడ్డులోని సర్వేనంబర్ 245లో తనకు భూమి ఉందని, అందులో రూ.3వేలకే ఇంటిస్థలం విక్రయిస్తానంటూ పేదలను నమ్మించాడు. విలువైన భూముల్లో స్థలాలు కావడంతో పేదలు ఆశపడి 200 మందికిపైగా డబ్బు చెల్లించారు. ఒక్కోక్కరి నుంచి రూ.3, రూ.4 వేలు చొప్పున వసూలు చేశాడు. డబ్బు చెల్లించిన పేదలకు ఇంటిస్థలం కేటాయించినట్టు, హద్దులు సర్వేనంబర్లతో బాండ్లపై తన సంతకాలతో అగ్రిమెంటు చేయించి ఇచ్చాడు. ఈ అగ్రిమెంట్లు పొందిన పేదలు స్థలాలు చూపాలని కోరడంతో గత ఏడాది చివర్లో పెట్రోలు బంకు వద్ద ఉన్న భూముల్లోకి పేదలను తీసుకెళ్లి ప్లాట్ల హద్దులు వేసేందుకు ప్రయత్నించడంతో భూ యజమానులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. దీన్ని పరిశీలించిన గత తహసీల్దార్ ధనుంజయులు ప్లాట్ల పేరుతో అగ్రిమెంట్లు చేసిఇచ్చిన పెద్ద ఓబులేశుకు భూమిలేదని, ఇతరుల భూములను తన భూములుగా చెప్పుకొంటున్నాడని బహిరంగ ప్రకటన విడుదల చేశారు. తర్వాత కొంత కాలం నిశ్శబ్దంగా ఉన్న ఓబులేశు సర్వే నంబర్ నంబర్ 243/1లోని 9.27 ఎకరాల భూమిలో ప్లాట్లు చూపిస్తానని పేదలకు చెప్పి కొందరి నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.25వేలు వసూలు చేశాడు. ఈ భూమికి సంబంధించి పదిమందికిపైగా యజమానులు ఉన్నారు. తమ భూమిలో ఓబులేశు ప్లాట్లు ఇస్తానని చెప్పడంపై ఆందోళనకు గురయ్యారు. రూ.15 కోట్లకుపైగా విలువైన ఈ భూమిలో ప్రవేశించి ప్లాట్ల హద్దులు చూపిస్తానని పేదలకు తీసుకొచ్చాడు. దీనిపై భూ యజమానుల్లో ఒకరైన గండువారిపల్లెకు చెందిన కే.చంద్రశేఖర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. విచారించిన ఎస్ఐ రామమోహన్ పేదలను మోసంచేసి ఇతరుల భూములను ఆక్రమించే ప్రయత్నం చేసిన దేరంగుల పెద్ద ఓబులేశుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

టైర్ల దొంగ అరెస్ట్

- డూప్లికేట్ కీస్‌తో దొంగతనానికి పాల్పడ్డ మాజీ ఉద్యోగి
- రూ.6.50 లక్షల విలువచేసే 383 టైర్లు స్వాధీనం


నిందితుని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న టైర్లను పరిశీలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : టైర్ల దుకాణంలో పనిచేసిన ఓవ్యక్తి పని మానేశాక, డూప్లికేట్ కీస్‌తో సుమారు రూ.6.50లక్షల విలువచేసే ఎం.ఆర్.ఎఫ్ టైర్లను దొంగిలించి పోలీసులకు పట్టుబడిన సంఘటన బుధవారం పట్టణంలో వెలుగుచూసింది. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప చోరీ వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయిజిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన ఆవుల కృష్ణమూర్తి(33) జీవనోపాధికి మదనపల్లెకు వచ్చి నాగిరెడ్డివీధిలో నివాసం ఉంటూ పుంగనూరురోడ్డులోని గరుడటైర్స్‌జోన్(ఎంఆర్‌ఎఫ్ టైర్ల దుకాణం)లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. దుకాణంలో మూడేళ్లుగా పనిచేస్తూ యజమానికి నమ్మకంగా ఉండేవాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వ్యక్తిగత కారణాలతో పనిమానేస్తున్నట్లు యజమానికి తెలిపాడు. విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో టైర్లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే పనిచేస్తున్న సమయంలో దుకాణం తాళాలను డూప్లికేట్ చేయించుకుని తన వద్ద ఉంచుకున్నాడు. గరుడటైర్స్ జోన్ ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటుంది. తర్వాత దుకాణాన్ని మూసి వేసి యజమాని ఇంటికి వెళ్లిపోతారు. ఈ విషయం తెలిసిన కృష్ణమూర్తి రాత్రి 7 గంటల తర్వాత డూప్లికేట్ కీస్‌తో దుకాణాన్ని తెరచి ఇతరులకు అనుమానం రాకుండా టైర్లను తెలివిగా చోరీ చేసి ఆటోలో బయటకు తరలించేవాడు. ఇలా పలుమార్లు తరలించిన టైర్లను బయటివ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. దుకాణంలో యజమానికి టైర్లు తగ్గాయన్న అనుమానం రాకుండా షాపులోని కంప్యూటర్లో టైర్ల వివరాలు నమోదుచేసి అమ్మకాలు జరిపినట్లుగా ఎంట్రీ వేసేవాడు. దీంతో యజమానికి అనుమానం రాలేదు. కృష్ణమూర్తి వద్ద టైర్లను కొనుగోలు చేసిన వ్యక్తులు వాటికి బిల్లులు అడిగితే.. యజమాని ఊరికి వెళ్లాడని, వచ్చాక తానే తెచ్చిస్తానని నమ్మించేవాడు. ఈ విధంగా పలుదఫాలుగా రూ.6.50లక్షల విలువ చేసే 383 టైర్లను చోరీ చేశాడు. ఇటీవల షాపులోని అమ్మకాలు, నగదు తదితర వివరాలను సరి చూసుకున్న షాపు యజమాని దీపక్ అమ్మకాల్లో తేడాను గమనించాడు. దీంతో రోజువారీగా వివరాలను సరిచూస్తూ వచ్చాడు. దీంతో కొన్ని టైర్ల వివరాలు సరిపోలకపోవడంతో, ఈనెల 10వ తేదీన టైర్లు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈనెల 18వ తేదీన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ మహబూబ్‌బాషా, పోలీసులు దర్యాప్తు చేయగా కృష్ణమూర్తి టైర్లు చోరీ చేసినట్లు నిర్ధారణయింది. నిందితుడిని అరెస్ట్ చేశారు. వీటిలో ద్విచక్రవాహన టైర్లు 350, ఆటో టైర్లు 25, ట్రాక్టర్ టైర్లు 6, బొలేరో టైర్లు 2 నిందితుని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఇన్‌చార్జి ఆర్డీఓగా భాస్కర్



రాజంపేట : రాజంపేట ఇన్‌చార్జి ఆర్డీఓగా కే.భా స్కర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన సోమశిల ఎస్‌డీసీ(రాజంపేట)గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా సబ్‌కలెక్టర్‌గా వచ్చిన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పదోన్నతిపై జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

నలుగురికి గాయాలు


మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. మదనపల్లె బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లెకు చెందిన సోమశేఖర్, అతనిభార్య లక్ష్మి కుమారుడు కిరణ్, కుమార్తె లోహితతో కలిసి పట్టణంలోని ఓ వివాహానికి మంగళవారం రాత్రి హాజరయ్యారు. ద్విచక్రవాహనంలో తిరిగి వెళుతుండగా నిమ్మనపల్లె కూడలి వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య సుకన్య

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరు మండలంలోని దేశెట్టిపల్లె గ్రామ సమీపంలో ఓ మామిడి తోటలో మర్రి కృష్ణయ్య (47) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతునికి భార్య సుకన్య, నలుగురు సంతానం ఉన్నారు. మృతుని భార్య వివరాల మేరకు... దేశెట్టిపల్లె గ్రామానికి చెందిన కృష్ణయ్య మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటినా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య ఆయన సెల్‌కు ఫోన్ చేసింది. అలా చాలా సార్లు చేసినా ఎలాంటి స్పందన రాలేదు. బుధవారం తెల్లవారే సరికి గ్రామం పక్కనే ఉన్న మామిడి తోటలో శవమై ఉన్నాడని తెలుసుకున్న ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. తండ్రి మృతి చెందడంతో వారి పిల్లలు కూడా రోదిస్తున్నారు. కృష్ణయ్య మామిడి కాయలకు వెళితే ఆ తోట యజమానులు ఏమైనా కొట్టి చంపేశారా, లేక ఏవైనా కారణాలతో ఇలా చేశారా అని మృతుని భార్య, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని చేతికి గాయం కాగా చెవి నుంచి రక్తం కారినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వేటగాళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో అడవి జంతువుల వేటగాళ్లు

సుండుపల్లె (రాయచోటిటౌన్) : అడవి జంతువులను వేటాడటానికి వెళ్లిన ఏడుగురు వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచురాజు తెలిపారు. మంగళవారం రాత్రి తమ సిబ్బందిలోని ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, లింగాధర్ ఆయన టీం సభ్యులతో పాటు సానిపాయి టాస్క్‌ఫోర్స్ ఎర్రచందనం స్మగ్లర్లను వేటాడటానికి వెళ్లారని చెప్పారు. అయితే పింఛా సెక్షన్‌లోని జిల్లేడమంద బీట్‌లోని దయ్యాలపెంటలో కూంబింగ్ నిర్వహిస్తుండగా రాతిదొన ప్రదేశంలో కొందరు వ్యక్తులు ఉండటాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు అడవి జంతువులను వేటాడటానికి వచ్చినట్లు తెలిసిందన్నారు. పట్టుబడిన వారిలో రాయవరం గ్రామం పాముల సాయి, ముడుంపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ సురేంద్ర,పాగ మురళి, బోడక సురేంద్ర, పసుపులేని భాస్కర్, కడప పట్టణానికి చెందిన చిప్పల సాయికుమార్, షేక్ హుస్సేన్ ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి ఒక నాటు తుపాకీ, నల్లమందు, రవ్వల గుండ్లు, మందు సంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అప్పటికే ఈ తుపాకీతో రెండు రౌండ్లు దుప్పిని కాల్చారని అయితే అది తప్పించుకొని పారిపోయినట్లు వారు చెప్పినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేస్తాం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి


రాయచోటిలో విలేకరులతో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

రాయచోటి : రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. రాయచోటిలో బుధవారం నిర్వహించిన భారతీయ జనతాపార్టీ రాజంపేట పార్లమెంటరీ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. అదే స్థాయిలో క్షేత్రస్థాయి నుంచి భారతీయ జనతాపార్టీని పటిష్ట పరిచి ముందుకు తీసుకెళ్లడమే ముఖ్య లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశానికి చేసిన సేవ, రాష్ట్రాలకు అందించిన సహకారం ద్వారా జరిగిన మేలు గురించి అర్థమయ్యేలా ప్రజలకు వివరించి చేరువవుతామని పురందేశ్వరి తెలిపారు. కాగా, కడప-బెంగుళూరు వయా రాయచోటి నుంచి వెళ్లే రైల్వే లైన్ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి పూర్తి చేయించే బాధ్యతను తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ప్రతిభ గంగిరెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకులో తక్కువ వడ్డీకే రుణాలు

ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకులో తక్కువ వడ్డీకే లబ్ధిదారులకు రుణాలను అందజేస్తున్నామని డీసీసీ బ్యాంకు, ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ రాణి అన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నష్టాలలో ఉన్న కడప డీసీసీ బ్యాంకును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆప్‌కాబ్ సహకారంతో లాభాలబాటలోకి తీసుకుని వచ్చామని, అందుకోసం పదవి చేపట్టిన రోజు నుంచి నిరంతర కృషి చేస్తూనే ఉన్నామన్నారు. ఇప్పటి నుంచి సొసైటీలను లాభాలబాటలోకి తీసుకుని రావడమే ధ్యేయంగా పని చేస్తామని, అందుకు సొసైటీ అధ్యక్షుల సహకారం కావాలన్నారు. ఇప్పటికే చాలా సొసైటీలలో కళ్యాణ మండపాలు నిర్మించడానికి, పెట్రోల్‌బంక్‌లు స్థాపించడానికి, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడానికి నాబార్డు నుంచి 1 శాతం వడ్డీతో రుణాలు ఇప్పిస్తామన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడానికి కడప డీసీసీ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. అలాగే ఆఫీసు కోసం స్థలం కొనుక్కోడానికి, భవన నిర్మాణానికి రూ. 25 లక్షల వరకు రుణాలు ఇస్తుందన్నారు. ఈ సౌకర్యాలను వినియోగించుకుని సొసైటీలను అభివృద్ధిపథంలో నడిపించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలను అత్యంత తక్కువ వడ్డీకి డీసీసీ బ్యాంకు మాత్రమే ఇస్తుందన్నారు. అలాగే ఏపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కస్టమ్ హైరింగ్ సెంటర్స్, అమూల్ పాల వెల్లువ, జగనన్న తోడు తదితర పథకాలను కడప డీసీసీ బ్యాంకు విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. రూ.2100 కోట్లు రుణాలు రైతులకు అందచేశామన్నారు. ఈ సమావేశంలో పేటీఎం వారి మొట్టమొదటి పాస్ మెషిన్‌ను బ్యాంకు కరెంట్ అకౌంట్ ఖాతాదారు అయిన బహర్ కేఫ్ రెస్టారెంట్ వారికి ఇవ్వడం ద్వారా కడప డీసీసీ బ్యాంకులో పాస్ మెషిన్‌లకు ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బాకీ డబ్బుల విషయమై ఇరువర్గాల ఘర్షణ


మీడియాతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం నగరిగుట్టలో మంగళవారం మధ్యాహ్నం బాకీ డబ్బుల విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని అర్బన్ సీఐ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హుస్సేన్, ఏఎస్ఐ స్వామిలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం రత్నాకర్‌కు ఇచ్చిన రూ.20వేల బాకీ డబ్బులను అడిగేందుకు రత్నాకర్ ఇంటికి నగరిగుట్టకు చెందిన మోటా వినోద్, విజయ్‌లు వెళ్లారని.. ఇదే క్రమంలో మా ఇంటి వద్దకు వచ్చి డబ్బులు అడుగుతావా అంటూ.. మాట మాట పెరిగి వినోద్, విజయ్‌కుమార్‌లతో రత్నాకర్, అతని బంధువు మణి ఘర్షణకు దిగారన్నారు. ఈ ఘర్షణలో వినోద్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. వినోద్‌పై దాడి చేయడంతో అతని బంధువులు రత్నాకర్, అతని బంధువుల ఇళ్లపై దాడి చేసి తలుపులు, వస్తువులను పగులగొట్టారు. ఇంటి బయట ఉన్న రెండు బైకులకు నిప్పు పెట్టి మరో బైకులను రాళ్లతో ధ్వంసం చేశారన్నారు. ఈ ఘర్షణలో రత్నాకర్ బంధువు మణికి కూడా గాయాలయ్యాయన్నారు. ఈ విషయాన్ని కొన్ని మీడియాలు అసత్యాలను ప్రసారం చేశారన్నారు. అసత్యాలను ప్రసారం చేయడంవల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగి.. అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వినియోగదారులు సంతృప్తి చెందేలా విద్యుత్ సేవలు

- రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ అందించాలి
- ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలి
- ఏపీఎస్పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు ఎస్. రమణ

కడప కార్పొరేషన్ : వినియోగదారులు సంతృప్తి చెందేలా విద్యుత్ సేవలు అందించాలని ఏపీఎస్పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు ఎస్ రమణ అన్నారు. బుధవారం సాయంత్రం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తు చేసుకున్న వెంటనే సర్వీసులు విడుదల చేయాలన్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు సిబ్బంది సేఫ్టీ బెల్టు, ఇండక్షన్ టెస్టర్, రబ్బరు తొడుగులు, ఎర్త్ రాడ్ వంటి సేఫ్టీ పరికరాలు తప్పకవాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు ఐదు నిముషాల పనే కదా అని తాత్సారం చేసి భద్రతా పరికరాలు వాడకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. క్షేత్రస్థాయి అధికారులు విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉంటూ ప్రమాద రహిత జిల్లాగా మార్చాలని సూచించారు. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు బిగించాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. కడప డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల పొలాలకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయలన్నారు. విద్యుత్ మరమ్మతులు, అంతరాయాలను వినియోగదారులకు ముందస్తుగా తెలియజేసేందుకు ఉర్జామిత్ర యాప్‌లో అంతరాయాలను నమోదు చేయాలని, పత్రికా ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహప్రసాద్, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

- 29 నుంచి ర్యాంకులవారీగా ధ్రువ పత్రాల పరిశీలన
- పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి



కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పాస్ అయి పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ కోసం గురువారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ సిహెచ్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి ప్రాసెసింగ్ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. ప్రాసెసింగ్ రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 750, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250 చెల్లించాలని తెలిపారు. 25వ తేదీ నుంచి ప్రాసెసింగ్ రుసుం చెల్లించుటకు ఆన్‌లైన్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తరువాత సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కోసం తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు 29వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్ల జిరాక్స్‌తో రావాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తమతో పాటు ప్రాసెసింగ్ రుసుం రసీదు, పాలిసెట్ ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సి మార్కుల మెమో, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఇన్ కమ్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని సూచించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత మొబైల్ నెంబ ర్‌కు లాగిన్ ఐడి వస్తుందని తెలిపారు. రిజిస్టర్ మొబైల్ నెంబర్ తో జూన్ 1వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుం చె ల్లించిన తర్వాత మాత్రమే హెల్ప్‌లైన్ సెంటర్‌కు షె డ్యూల్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావలసింది గా తెలిపారు. పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్లను కడప లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం కడప మ హిళా పాలిటెక్నిక్ కళాశాలకు మాత్రమే రావాలన్నారు. స్కౌట్, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పీహెచ్ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలకు జూన్ 2వ తేదీ వెళ్లాలని తెలిపారు.

మానసిక వేదనతో వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని చిలకలబావి సమీపంలో కరీమూన్ కాంప్లెక్స్‌లో నివాసం వుంటున్న షేక్ జమాల్ బాషా(36) ఈనెల 23వ తేదీ రాత్రి మానసిక ఆవేదనతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని సోదరి షబానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. షేక్ జమాల్‌బాషా భార్య ఆరీపున్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. జీవనాధారం కోసం ఆరీపున్ ఏడాది కిందట కువైట్‌కు వెళ్లింది. ఏడాది కిందటే జమాల్ బాషా తండ్రి మదార్‌సాబ్ మృతి చెందాడు. తండ్రి మరణించినప్పటి నుంచి తీవ్ర మానసిక వేదనతో బాధపడే జమాల్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఫిర్యాదు రావడంతో టూటౌన్ ఎస్ఐ యు.వై. జయరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.